# మోడీ-మూడు చట్టాల రద్దు ప్రకటన-ఉద్యమించిన రైతుల విజయం

## మరో కోణంలో పాలకుల మోసకారితనం

**నవంబర్** 19వ తేదీన ప్రధాని నరేంద్రమోడీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించాడు. ఈ ప్రకటనతోపాటుగా మోడీ సుదీర్ఘ వివరణను కూడా జోడించాడు. తాము తెచ్చిన మూడు చట్టాలు చాలా వుపయోగకరమైనవనీ, దేశానికీ రైతులకూ ప్రయోజనకరమైనవనీ అయితే వీటిని 'కొందరు' రైతులకు సరిగా అర్థం చేయించలేకపోవటం వలన వారిలో అపోహలు తలెత్తి అసంతృప్తి వ్యక్తమైన కారణంగా ఈ చట్టాలను రద్దు చేస్తున్నట్లు వివరించాడు. అందువలన సరైన చట్టాలు అయినప్పటికీ అనవసరంగా రైతులు ఉద్యమం చేశారని మోడీ స్పష్టం చేయదలచుకున్నాడు.

ఇక, క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించిన మోడీ ఎవరికి, ఎందుకు అనే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అస్పష్టంగా వ్యక్తీకరించాడు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో, దేశం మొత్తంలో ప్రజానీకం కకావికలు అవుతున్న నేపథ్యంలో 2020 జూన్‌లో హడావుడిగా తొలుత ఈ చట్టాలను ఆర్డినెన్స్‌లుగా ఎందుకు రూపొందించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వలేదు. 2020 సెప్టెంబర్‌లో పార్లమెంట్‌లో చట్టాలుగా రూపొందించే తరుణంలోనూ వీటిపై సంబంధిత ప్రజానీకంతోనే గాదు-కనీసం చట్ట సభలలో సవివరంగా ప్రజాస్వామ్యయుతంగా చర్చలు కూడా జరపకుండా ఎందుకంత హడావుడిగా, ఏకపక్షంగా, నిరంకుశంగా వ్యవహరించాల్సి వచ్చిందో వివరించలేదు. ఫలితంగా గత సంవత్సర కాలంగా రైతాంగం -ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం-ఢిల్లీ సరిహద్దులనే నివాసంగా చేసుకొని ఎండ, వాన, చలి, వాతావరణ ప్రతికూలతలను, కరోనా విపత్కర పరిస్థితులను లెక్కచేయక మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ముందుకు సాగిస్తున్నారు.

ఈ క్రమంలో బూటకపు చర్చల తతంగాన్ని 11 పర్యాయాలు కొనసాగించిన సందర్భంలో కూడా ఈ చట్టాలను వెనక్కు తీసుకోవాలనే ఆలోచన మోడీ ప్రభుత్వానికి రాలేదు; మొండిగా వ్యవహరించింది. తీవ్రమైన నిర్బంధం, అణచివేత ప్రయోగించింది; దుష్ప్రచారాలు సాగించింది. రైతుల ఉద్యమాన్ని విచ్ఛిన్నంచేసి, మూడు వ్యవసాయ చట్టాలను నిరాటంకంగా ముందుకు తీసుకువెళ్లాలని సర్వదా, శతధా ప్రయత్నించింది.

ఉద్యమిస్తున్న అనేకమంది రైతులు, రైతు నాయకులపైనా, వారికి మద్దతుగా నిలిచిన జర్నలిస్టులు, ఇతర మేధావులపైనా రాజద్రోహ నేరాన్ని మోపి జైళ్ళలో నిర్బంధించింది. ఈ ఉద్యమ క్రమంలో దీనిలో పాల్గొంటూ గత సం॥ర కాలంలో 700 మందికి పైగా రైతులు వివిధ కారణాలతో మరణించారు. మరణించిన రైతాంగానికి సంతాపం తెలియజేయటానికి కూడా ఈ ప్రకటన సందర్భంగా మోడీకి నోరు పెగలలేదు.

'3 చట్టాలు రద్దుచేశాము కనుక ఇళ్ళకు వెళ్ళిపోండి' అనిన మోడీ పిలుపుకు రైతులెవరూ సానుకూలంగా స్పందించకపోవటమే కాదు;' ఆ మాటలు ఆచరణ రూపం తీసుకునే వరకు విశ్వంశించేదే లేదు; అక్కడి నుండి కదిలేదు లేదు' అని తేల్చి చెప్పటం ప్రజల విశ్వాసాన్ని పాలకులెంతగా కోల్పోయారనే దానికి ఉదాహరణగా నిలుస్తుంది. రైతాంగానికి కీలకమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించటం గురించి, విద్యుత్తు బిల్లు-2020 రద్దు ఇతర డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకునేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించటం ఆహ్వానించాల్సిన అంశం.

### దొడ్డిదారిన అమలుకు వ్యూహాలు

మూడు వ్యవసాయ చట్టాల అమలు ఈపాటికే వివిధ రాష్ట్రాలలో భిన్నస్థాయిల్లో అమలు జరుగుతోందనేది వాస్తవం. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ల రద్దు, ఈ-నామ్‌ల (ఎలక్ట్రానిక్-నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) ఏర్పాటు, కాంట్రాక్టు, కార్పొరేటు వ్యవసాయం, ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను నీరుగార్చటం, కేంద్రప్రభుత్వ ధాన్యం కొనుగోలు సంస్థలను నిస్తేజం చేయటం, నిత్యావసరాలపై ప్రభుత్వ నియంత్రణను ఎత్తివేయటం మొదలైన రూపాల్లో ఈ మూడు నిరంకుశ చట్టాల్లోని వివిధ అంశాలు ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అనేక మోతాదుల్లో అమలు అవుతున్నాయి. వీటన్నింటినీ ఏకీకృతంచేసి, దేశవ్యాపితంగా మరింత కట్టుదిట్టంగా చట్టాలు చేసి, బడా బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు మరింత మేలు చేయాలనుకున్న మోడీ వ్యూహం తాత్కాలికంగా బెడిసికొట్టింది. కార్పొరేటు సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు ఆశించిన స్థాయిలో వారికి వెంటనే ప్రయోజనం చేకూర్చే పనిని చట్టబద్ధం చేయలేకపోయినందుకు బహుశా మోడీ వారికి క్షమాపణ చెప్పివుండవచ్చు. కనుక సమీప కాలంలో జరగనున్న ఐదు ఉత్తర భారత రాష్ట్రాల శాసనసభ ఎన్నికల దృష్టితో మోడీ చేసిన మూడు చట్టాల రద్దు ప్రకటన మోసకారితనంతో కూడుకున్నదనేది స్పష్టం.

## గత అనుభవం

బ్రిటిష్ పాలనా కాలంలో ప్రజాప్రయోజనం పేరుచెప్పి రైతులనుండి, ప్రజలనుండి ప్రభుత్వం భూములను ఇష్టారాజ్యంగా సేకరించే 'భూసేకరణ చట్టం-1894'కు యుపిఏ-2 పాలనాకాలం చివరలో కొన్ని సవరణలు చేశారు. కాగా, ఎన్‌డిఏ - పాలనా కాలంలో దీనికి మరిన్ని సవరణలు చేసి, దేశ, విదేశీ బడా కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు ప్రజల, రైతుల భూములను పాలకులు తమ చిత్తమొచ్చిన విధంగా కట్టబెట్టేందుకు అన్ని అవకాశాలు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు. భూములు, వ్యవసాయం మొదలైనవి రాష్ట్ర జాబితాలోని అంశాలైనప్పటికీ కేంద్ర పాలకులు ఖాతరు చేయలేదు.

విచక్షణారహితంగా భూముల సేకరణ బిల్లుపై దేశవ్యాపితంగా రైతాంగం, ప్రజానీకం నుండే కాక, పాలక ప్రతిపక్షాల నుండి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవటంతో మోడీ ప్రభుత్వం ఆ బిల్లుకు చట్టరూపమివ్వకుండా ప్రక్కనుంచి, రాష్ట్రాలు తమ అవసరం కనుగుణంగా వ్యవహరించుకోమని ఆయా ప్రభుత్వాలకు వదలివేసింది. ఆ తర్వాత క్రమంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రాజెక్టుల పేరున లక్షలాది ఎకరాల భూములను-అటవీ భూములతో సహా-ప్రజలనుండి, రైతులనుండి గుంజుకొని బడా పారిశ్రామిక వర్గాలకు కట్టబెట్టటంలో వారికి ఏ చట్టాలూ అడ్డురాలేదనేది గమనించాలి.

## చట్టాల రద్దు తర్వాత ఉద్యమం మరింత ముందుకు సాగాలి

కార్పొరేట్ల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు దోపిడీ పాలకులు ఎంతగా ఊడిగం చేస్తారో ఈ ఉద్యమ క్రమంలో మరోసారి తేటతెల్లమైంది. గత 75 సం॥లుగా భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ అనుకూల విధానాలను పాలకులు అమలుచేసుకుంటూ వస్తున్న దానిలో భాగమే ప్రస్తుత 3 వ్యవసాయ నల్లచట్టాలు అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం ఈ చట్టాలను రద్దుచేసినా, వీటిని మరో రూపంలోనైనా అమలుజేసే పాలకుల ప్రయత్నాలను ప్రతిఘటించాలి. దేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని దోపిడీ వర్గాలకు అనుగుణంగా మలిచే పాలకుల విధానాలను బహిర్గతం చేయాలి. దేశీయ, స్వతంత్ర, ప్రజల నిజమైన వాస్తవికమైన అభివృద్ధి సాధించటంకోసం ఉద్యమించాలి.

*****